క్లుప్తంగా

అనారోగ్యంతో ఉప సర్పంచ్ మృతి


ముకుందరెడ్డి (ఫైల్)

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట పంచాయతీ ఉప సర్పంచ్ కుంభం ముకుంద రెడ్డి (54) అనారోగ్యంతో మృతిచెందాడు. నాలుగు రోజుల క్రితం తలనొప్పి, వాంతులు కావడంతో కుటుంబీకులు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అటు నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గతంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పని చేశారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ..


సత్తయ్య(ఫైల్)

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గుర్రం సత్తయ్య(75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈయన ఉప సర్పంచ్‌గా, రామాలయ కమిటీ చైర్మన్‌గా పనిచేసి ప్రజల్లో మంచి గుర్తింపు పొందాడు. ఆయన మృతి పట్ల గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

మినిమం టైం స్కేల్ ఇప్పించాలని వినతి

బెల్లంపల్లి: సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న తమకు మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) ఇప్పించాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ఉద్యోగులు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను వేడుకున్నారు. శుక్రవారం ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

చేనేత దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

రామకృష్ణాపూర్: జాతీయ చేనేత దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణకు పద్మశాలీ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందించారు. ప్రధాని మోదీ ఇటీవల చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించడం హర్షయనీయమన్నారు. సత్యనారాయణ, సారంగపాణి, తిరుపతి, సమ్మయ్య ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు


కంచెను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

బెల్లంపల్లి: ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితులపై ఈనెల 17న 'కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి డిస్కం అధికారులు శుక్రవారం స్పందించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ కొత్త బస్టాండ్ చౌరస్తా వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉండటంతో కంచె నిర్మించారు.

సొమ్మసిల్లిన పంచాయతీ కార్మికుడు

నెన్నెల: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెలో పాల్గొన్న మైలారానికి చెందిన కార్మికుడు వేల్పుల రాజం శుక్రవారం దీక్షా శిబిరంలో సొమ్మసిల్లి పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు స్థానిక పీహెచ్‌సీ తీసుకెళ్లి చికిత్స అందించారు. రాజం అల్పాహారం చేయకుండా దీక్షా శిబిరానికి చేరుకున్నాడు. అరగంట తర్వాత కళ్లు తిరుగుతున్నాయని చెప్పి పడిపోయాడు. చికిత్స తర్వాత అతడిని ఆటోలో ఇంటికి పంపించినట్లు కార్మికులు తెలిపారు. ఇటీవల నందులపల్లికి చెందిన దుర్గం మొండి నీరసించి పడిపోయారని పేర్కొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో 13 తీర్మానాలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో 13 అంశాలపై సభ్యులు ఆమోదం తెలిపారు. బొక్కలగుట్ట గాంధారివనంలో ఏర్పాటుచేయనున్న శిల్పారామం సంబంధించి 12 ఎకరాల స్థలంలో టోపో సర్వే చేసేందుకు ఆమోదించారు. అదే గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు సమావేశంలో తీర్మానించారు. అలాగే, మున్సిపాలిటీలో 30 మంది పారిశుధ్య సిబ్బందిని తాత్కాలిక పద్ధతిన నియమించేందుకు, రోడ్ కటింగ్ మిషన్ కొనుగోలుకు, వార్డుల్లో ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేసేందుకు సభ్యులు ఏకగ్రీవంగా అంగీకరించారు. సమావేశంలో కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, ఆర్వో కృష్ణప్రసాద్, ఏఈ అచ్యుత్ పాల్గొన్నారు.

ఏటా తప్పని ముప్పు!


రాళ్లవాగులో కలిసి పోయినట్లుగా ఉన్న ఎన్టీఆర్ నగర్ కాలనీ


రాంనగర్‌లోని ఇళ్ల మధ్య చేరిన వరద నీరు


సమీప కాలనీలోని ఇళ్లను తాకుతూ ప్రవహిస్తున్న రాళ్లవాగు

- జిల్లా కేంద్రంలో లోతట్టు ప్రాంతాల కాలనీలు జలమయం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ప్రతి ఏటా ఇదే తంతు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీలకు వరద ముప్పు తప్పేలా లేదు. ఏటా వర్షాకాలంలో కురిసే వానలకు లోతట్టు ప్రాంతాల్లోని పలు కాలనీలు జలమయంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి నదిలోకి వరద నీటిని వదలడంతో జిల్లా కేంద్రం నుంచి పారుతున్న రాళ్లవాగు, చెరువు మత్తడి నీరు కాలనీల్లోకి వచ్చి చేరుతుంది. ఏటా వరద ముప్పు ఉంటున్నా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

గురు, శుక్రవారాల్లో వర్షం విరామం ఇవ్వడంతో, వరద కొంత తగ్గుముఖం పట్టింది. భారీ వర్షాలకు కడెం, ఎస్సారెస్పీ నుంచి వరద నీటిని గోదావరిలోకి వదలడంతో, ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుకుండలా మారింది. దీంతో 48 గేట్లను గురువారం తెరవడంతో రాళ్లవాగులో వరద ఉధృతి పెరిగింది. దీంతో జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీ, రాంనగర్, పద్మశాలి కాలనీలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాళ్లవాగులో ఇళ్లు నిర్మించారా అనే విధంగా వాగు, ఇళ్లు కలిసి పోయేలా వరద నీరు వచ్చి చేరింది. గతేడాది ఆ మూడు కాలనీలతో పాటు, ఎల్‌ఐసీ కాలనీ, ఆదిత్య ఎంక్లేవ్, సాయికుంట, రెడ్డి కాలనీ, పాతమంచిర్యాల కాలనీలు వరద నీటిలో మునిగిపోయాయి. ఈ ఏడాది శాఖల అధికారులు ముందస్తు చర్యలను తీసుకోవడంతో, వరద తాకిడి గత ఏడాది కంటే కొంత తగ్గింది. కానీ ఎన్టీఆర్‌నగర్, రాంనగర్, పద్మశాలికాలనీలోని దాదాపు 500లకు పైగా ఇళ్లు వరద నీటిలో మునిగిపోవడంతో, ఆయా ఇళ్లల్లో ఉన్న వారిని ముందురోజే భవన నిర్మాణ కార్మిక సంఘ భవనం, ఆర్‌బీహెచ్‌వి హైస్కూల్, వైశ్య భవన్‌కు తరలించి వసతిని కల్పించారు. గత మూడేళ్లుగా కాలనీలు మునిగి పోవడంపై ప్రజాప్రతినిధులు, అధికారులపై ముంపు బాధిత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థికసాయం అందలేదు



మూడేళ్లుగా వరదలు వచ్చి ఇళ్లు మునిగిపోతున్నాయి. ఇళ్లు ఖాళీ చేయిస్తున్నారు. వరద తగ్గిన తర్వాత ఇంట్లో సామన్లు పనికిరాకుండా పోతున్నాయి. ఆర్థికంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థికసాయం అందడం లేదు.

– మహదిండి, ఎన్టీఆర్‌నగర్ కాలనీ

చర్యలు తీసుకోవాలి



వర్షాకాలం వచ్చిందంటే చాలు మాకు వరదలు వస్తున్నాయి. ఏటా ఇదే తంతుగా మారుతోంది. వర్షాకాలం పోయే వరకు భయం భయంగా బతకాల్సి వస్తుంది. తమను ఇతర చోటుకు తరలించి, వరదల బారిన పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– రహురా బేగం, ఎన్టీఆర్ నగర్ కాలనీ


పద్మశాలి కాలనీలోని ఇళ్లల్లోకి చేరిన వరద నీరు


ఎన్టీఆర్ నగర్‌లో ఇళ్ల మధ్య చేరిన వరద నీరు


ఎన్టీఆర్‌నగర్ కాలనీలో వరద నీటిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు, ఇళ్లు

నీట మునిగిన పంట పొలాలు


కలమడుగులో పత్తి చేల నుంచి పారుతున్న గోదావరి నీరు


వరి పొలాల నుంచి పారుతున్న గోదావరి

జన్నారం: మండలంలో సుమారు 220 ఎకరాలకు పైగా పత్తి, 80 ఎకరాల వరి పంటలు నీటమునిగాయి. గోదావరి వరదకు రోడ్లు, విద్యుత్ స్తంభాలు కొట్టుకుపోయాయి. గోదావరి పరీవాహక గ్రామాలైన కలమడుగు, ధర్మారం, బాదంపల్లి, తిమ్మాపూర్, రాంపూర్, రోటిగూడ గ్రామాల్లో పొలాలు, పత్తి వరదకు కొట్టుకుపోయాయి. కలమడుగులో గ్రామంలో రెండు వాగులు పొంగాయి. వరద దాటికి 30 ఎకరాల్లో పత్తి, మరో 20 ఎకరాల్లో వరి, పసుపు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. బాదంపల్లిలో సుమారు 100 ఎకరాల్లో పత్తి నీటమునిగింది, మరో 40 ఎకరాలకు సరిపడా నారిమడులు, ధర్మారంలో 30 ఎకరాల వరకు పత్తి, రాంపూర్‌లో 20 ఎకరాల వరకు పత్తి పంటలు కొట్టుకుపోయాయి. రోటిగూడలో సుమారు 30 ఎకరాలు, తిమ్మాపూర్‌లో 10 ఎకరాల పత్తి గోదావరి ప్రవాహానికి కొట్టుకుపోయినట్లు రైతులు పేర్కొన్నారు.

- ముంపు ప్రాంతలైన రోటిగూడలో 30 ఇళ్లు, తిమ్మాపూర్ 10 కుటుంబాలను పోలీసులు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కొన్ని ఇళ్ల సమీపంలో నీరు రావడంతో భయందోళనలకు గురైనా శుక్రవారం గోదావరి ఉధృతి కొంత తగ్గింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నాలుగెకరాల్లో పంట దెబ్బతింది

ఎకరం పసుపు , మూడెకరాల్లో పత్తి వేశాను. పంట బాగానే పెరుగుతుంది. గోదావరి తీవ్రతతో పంటలు దెబ్బతింది. చేను నుంచే గోదావరి నీరు పారుతుంది. గతేడాది గోదావరి నీటిలో మునిగిన ప్రభుత్వం సాయం అందలేదు. ఇప్పుడు నష్టపోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

– సంగ వెంకటేశ్, కలమడుగు

ఉగ్ర గోదారి



జన్నారం: భారీ వర్షాలకు ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి వరద గేట్లు ఎత్తి గోదావరికి నీటిని వదలడంతో ఉగ్రరూపం దాల్చింది. రెండు ఒడ్లను దాటి పారింది. శుక్రవారం కలమడుగు గోదావరి వంతెన వద్ద స్థానికుల సందడి కనిపించింది. యువకులు సెల్ఫీ దిగారు.

పుష్కరఘాట్, మత్తడి వాగు పరిశీలన

వేమనపల్లి: ప్రాణహిత నది వరద నీటితో నిండు కుండలా ప్రవహిస్తోంది. వేమనపల్లి పుష్కరఘాట్ తో పాటు మత్తడి వాగు వరకు వెళ్లి వరద ఉధృతిని తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో బాపురావు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ శుక్రవారం పరిశీలించారు. అత్యవసరం అయితే తప్పా ప్రజలు నది పరిసరాలకు రావొద్దని హెచ్చరించారు.


వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవోలు

వేలాల చుట్టూ వరద నీరు


వేలాల ఇళ్ల చుట్టు చేరిన వరద నీరు

జైపూర్: వేలాల గ్రామంలో ప్రజలు భయంభయంగా గడుపుతున్నారు. గోదావరి నదిలో వరద నీటి ప్రవాహం పెరగడంతో గ్రామం చుట్టూ వరద నీరు వచ్చి చేరుతోంది. పంట పొలాలు జలమయంగా మారాయి. వేలాల, పొనూర్, శివ్వారం గోదారి తీరప్రాంత ప్రజలు భయంతో బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. జైపూర్ ఏసీపీ మోహన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ సీఐ రమేశ్, తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎస్సై ఉపేందర్‌రావు, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్, ఆర్‌ఐ కమల, ప్రజాప్రతినిధులు ప్రజల అవసరాలను తీర్చుతున్నారు.


పత్తిచేలపై నుంచి పారుతున్న గోదావరి వరద


ద్వారకలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు

పత్తి చేలలో వరద నీరు

దండేపల్లి: మండలంలోని ద్వారక సమీపంలో శుక్రవారం గోదావరినది పాయగా చీలి, వరదనీరు పత్తిచేలపై నుంచి పారింది. ఒకటి, రెండు చోట్ల పంట చేలల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. నదిలో వరద ఉధృతి కొనసాగడంతో ప్రజల అటువైపు వెళ్లొద్దని ఎస్సై ప్రసాద్ స్థానికులను హెచ్చరించారు.

కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం


నియామకపత్రం అందిస్తున్న వినోద్

బెల్లంపల్లి: నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులను నియమించినట్లు మాజీమంత్రి గడ్డం వినోద్ తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే పార్టీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మల్లురవి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడిగా ముచ్చర్ల మల్లయ్య, మండల అధ్యక్షుడిగా సింగతి సత్యనారాయణ, కాసిపేట, తాండూర్, భీమిని, నెన్నెల, వేమనపల్లి, కన్నెపల్లి మండలాల అధ్యక్షులుగా రత్నం ప్రదీప్, మహ్మద్ ఈసా, గాదం లక్ష్మీనారాయణ, గట్టు మల్లేశ్, సయ్యద్ సాబీర్ పాషా, పప్పుల రామాంజనేయులు నియమితులయ్యారు. పట్టణ కార్యాలయంలో వారికి వినోద్ శుక్రవారం నియామకపత్రాలు అందజేశారు. కొందరు వారి నియామకపు ఉత్తర్వులు చెల్లవని చేస్తున్న దుష్ప్రచారాన్ని కార్యకర్తలు నమ్మవద్దని కోరారు. అంతకు ముందు దివంగత మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి చిత్రపటానికి పూల మాల వేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, నాయకులు ఆనంద్, అంకం రవి, రాము పాల్గొన్నారు.

మూడేళ్లుగా వరదలు వస్తున్నా పట్టింపేది ?

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్


వరద నీటిని పరిశీలిస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: పట్టణ ప్రజలకు గత మూడేళ్లుగా వరదలు వచ్చి నష్టపోతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని, స్థానిక ఎమ్మెల్యే దివాకర్ రావు ఏం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్, ఎన్టీఆర్‌నగర్, పద్మశాలి కాలనీల్లో ఇళ్లల్లోకి చేరిన వరదకు గురైన ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో పట్టణంలోని పలు కాలనీలు మునిగిపోతున్నాయన్నారు. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ.10 వేలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘంలో ఉన్న ముంపు బాధితులకు పండ్లు, బ్రెడ్‌లను అందించారు.

రోడ్డుకు మరమ్మతు


జేసీబీతో రోడ్డు వేయిస్తున్న పోలీసు అధికారులు

తాండూర్: మండలంలోని ఓ గిరిజన గూడేనికి వెళ్లే రోడ్డుకు పోలీసులు శుక్రవారం మరమ్మతు చేయించి ఔదార్యాన్ని చాటుకున్నారు. మాదారం పోలీసు స్టేషన్ పరిధిలోని లచ్చుగూడకు వెళ్లే రోడ్డు కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతింది. దీంతో గిరిపుత్రులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య ఆదేశాలతో జేసీబీతో తాత్కాలికంగా రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. తాండూర్ సీఐ శ్రీనివాసరావు, మాదారం ఎస్సై రాజశేఖర్, సర్పంచ్, వీలేజ్ పోలీసు అధికారి సహకారంతో మట్టి రోడ్డు ఏర్పాటు చేయించారు.

గుంతలో దిగబడిన ట్రాక్టర్



మందమర్రిరూరల్: పట్టణంలోని సీఈఆర్ క్లబ్ సమీపంలోని గుంతలో సింగరేణి పారిశుధ్య ట్రాక్టర్ దిగబడింది. కాలనీల్లో భగీరథ పైపులైన్ కోసం విచ్చలవిడిగా కాల్వలు తవ్వుతున్నారే తప్ప సరిగ్గా పూడ్చడం లేదు. వర్షాలకు బురదగా మారి గుంత ఏర్పడడంతో వాహనాలు దిగబడుతున్నాయి.

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

చెన్నూర్: పట్టణంతోపాటు చెన్నూర్, కోటపల్లి మండలాల్లో శనివారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పర్యటించనున్నారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాల్లో ఆయన పర్యటించి బాధితులను పరామర్శించనున్నారు.

సంక్షిప్త వార్తలు

శిథిలావస్థకు చేరిన భవనాల తొలగింపు

మంచిర్యాలటౌన్: భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలోని ఐదు శిథిలావస్థకు చేరిన భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జేసీబీతో తొలగించారు. మరో 8 భవనాలు తొలగించనున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లొద్దు

జన్నారం: వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవరూ చేపల వేటకు వెళ్లొద్దని లక్సెట్టిపేట సీఐ కృష్ణ పేర్కొన్నారు. కలమడుగు గోదావరి నదిపై స్థానికులకు శుక్రవారం అవగాహన కల్పించారు. గోదావరి వంతెనపైకి పర్యాటకులు రావొద్దన్నారు. వంతెన సమీపంలో గజఈతగాళ్ల బెటాలియం ఏర్పాటు చేశామన్నారు. ఎస్సై సతీశ్, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్ ఉన్నారు.

మావోయిస్టుల ప్రలోభాలకు లోనుకావద్దు

వేమనపల్లి: మావోయిస్టుల ప్రలోభాలకు లోనుకావద్దని చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. జైపూర్ ఏసీపీ మోహన్ ఆధ్వర్యంలో మావోయిస్టు సంస్మరణ వారోత్సవాల సందర్భంగా కళ్లంపల్లిలో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనపత్రాలు లేని 18 బైక్‌లు, 2 ఆటోలు సీజ్ చేశారు. ఎస్సైలు సుబ్బారావు, సురేష్ పాల్గొన్నారు.

'మీ వల్లే ధైర్యంగా ఉన్నాం'

జన్నారం: వర్షాలకు ఏమి చేయలేని స్థితిలో ఉన్న మాకు అండగా నిలిచిన పోలీసుల వల్ల ధైర్యంగా ఉన్నామని రోటిగూడ గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం రోటిగూడలో లక్సెట్టిపేట సీఐ కృష్ణ, ఎస్సై సతీశ్, తహసీల్దార్ కిషన్‌ను సర్పంచ్ మల్క విజయ, ఎంపీటీసీ శంకరయ్య, గ్రామస్తులు సన్మానించారు.

వ్యాసరచన పోటీలు

జన్నారం: గ్లోబల్ టైగర్ డే పురస్కరించుకుని జన్నారం అటవీ డివిజన్ పరిధిలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అధికారులు హఫీజొద్దీన్, రత్నాకర్‌రావు ఉన్నారు.

స్వీపర్ల సమ్మెకు మద్దతు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో రిలేనిరాహారదీక్ష చేస్తున్న పాఠశాలల స్వీపర్లకు ధర్మసమాజ్ పార్టీ నాయకులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ శుక్రవారం మద్దతు ప్రకటించారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: కార్మిక సమస్యలు పరిష్కరించాలని ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య డిమాండ్ చేశారు. యూనియన్ ఆఫీస్‌లో ఆయన మాట్లాడారు. నరేందర్, చంద్రశేఖర్, బాస్కర్, వేణు, తిరుపతి పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

బెల్లంపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని శుక్రవారం పార్టీ జిల్లా నాయకులు కలిశారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఏమాజీ, జిల్లా మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు గోవర్ధన్, శ్రీనివాస్ ఉన్నారు.

యుద్ధభేరిని విజయవంతం చేయాలి

పాతమంచిర్యాల: కోరుట్లలో ఆగస్టు 13న నిర్వహించే పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి, చలో కోరుట్లను విజయవంతం చేయాలని టీఆర్‌పీఎస్ రాష్ట్ర సమన్వయ కర్త రామశ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలో యుద్ధభేరి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

23వ రోజూ కార్మికుల సమ్మె

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జీపీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 23వ రోజూ చేరింది. రాపల్లిలో ప్రైవేట్ వ్యక్తులతో పారిశుధ్య పనులు చేయిస్తుండగా కార్మికులు అడ్డుకున్నారు.

వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్సైగా ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల కేజీబీవీలో విద్యార్థినులకు సెక్టోరల్ అధికారి హేమలత ఇంటర్ పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఎస్‌వో స్వప్న ఉన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

భీమిని: కన్నెపల్లి మండలం లింగాల గ్రామంలో బక్కమ్మకు చెందిన ఇల్లు వర్షానికి కూలింది..

ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరం

జన్నారం: తిమ్మాపూర్, రోటిగూడలో వైద్యాధికారి ఉమాశ్రీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ హాజీపూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భారత్ బచావో సదస్సు విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: పట్టణంలోని దీపక్‌నగర్‌లో గల శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 30న నిర్వహించే భారత్ బచావో సదస్సును విజయవంతం చేయాల ని కమిటీ జిల్లా అధ్యక్షుడు రంగు రాజేశం కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు.

మొక్కలు నాటిన లయన్స్ సభ్యులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో 13 వార్డు గంగారాంనగర్‌లో శుక్రవారం సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి తదితరులు ఉన్నారు.

మణిపూర్ ఘటన దురదృష్టకరం

జన్నారం: మణిపూర్ ఘటన దురదృష్టకరమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనపై ప్రధాని నోరు మెదపకపోవడం సరికాదన్నారు.

ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం

చెన్నూర్‌రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేశ్ అన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన మండలంలోని సుందరసాల, పొక్కూరు, నాగాపూర్, అక్కెపల్లి, చింతలపల్లి గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయని అన్నారు. ఆస్తి నష్టంతోపాటు వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయన్నారు. అయినా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. నాయకులు ముత్యాల బాపాగౌడ్, ఖలీల్, రాజేందర్, రాజమోహన్‌రావు, లచ్చన్న, రాంగోపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ఉన్నారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ మార్చి ముంపు ప్రాంతాల రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజారమేశ్ డిమాండ్ చేశారు. సుందరసాల, నర్సక్కపేట, వెంకంపేట గ్రామాలను శుక్రవారం సందర్శించి ప్రజలను పరామర్శించారు.